క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



సూచనలు చేస్తున్న డీఈవో మాధవి

మంథని: మండలంలోని ఆరెంద ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాధికారి మాధవి బుధవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలపై పలు సూచనలు చేశారు. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, భవిష్యత్‌లో బంగారు బాటలు వేయడానికి పదో తరగతి పునాది అని అన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే సమాచారం అందించండి

పెద్దపల్లిరూరల్: సమాజంలో మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని షీటీం జిల్లా ఇన్‌చార్జి మౌనిక అన్నారు. పెద్దపల్లిలోని అరబిందో కాకతీయ పాఠశాలలో బుధవారం మహిళల భద్రతకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా, అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, వాట్సాప్ లింకులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, కరస్పాండెంట్ రమణారావు, డైరెక్టర్ మణి ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న మంథని సీఐ బి.రాజుగౌడ్

రామగిరి: గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంథని సీఐ బొల్లపల్లి రాజుగౌడ్ సూచించారు. మండలంలోని బుధవారంపేట(రామయ్యపల్లి)లో ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు డయల్ 100, సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, సీసీ కెమెరాల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఎస్సై పురుషోత్తం దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఖని'లో సెంట్రల్ లైబ్రరీ నిర్మించాలి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. గోదావరిఖని పవర్ హౌస్‌కాలనీలోని ప్రభుత్వశాఖ గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి, పాఠకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులతో కూడిన సెంట్రల్ లైబ్రరీ భవనాన్ని ప్రభుత్వం, సింగరేణి సంస్థలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో రామగుండం ఎమ్మెల్యే, ఆర్జీ–1 జీఎం చొరవ తీసుకోవాలని కోరారు. తాళ్లపల్లి సురేందర్, రాణవేణి సుధీర్‌కుమార్, పోతరాజు, నాగరాజు, వినయ్, సాయి ఉన్నారు.

విశ్వభారతి బులెటిన్ బోర్డులో సాక్షి ప్రత్యేక కథనం



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్ బులిటెన్ బోర్డులో బుధవారం సాక్షి ఫ్యామిలీ పేజీలో ప్రచురితమైన వెల్‌కమ్ సునీత విలియమ్స్ కథనం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. 9నెలల పాటు అంతరిక్షంలో ఉన్న భారతదేశ సంతతికి చెందిన సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి భూమికి వస్తున్న క్రమంలో వెల్‌కమ్ సునీత విలియమ్స్ కథనం విద్యార్థులను ఆకట్టుకుంది.

ఎన్టీపీసీ అధికారికి ఫిర్యాదు

జ్యోతినగర్: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో పని చేస్తున్న కన్జర్వెన్సీ కార్మికుల సంఖ్యను తక్కువ చూపించి నూతన టెండర్లను పిలవడంపై బుధవారం ఎన్టీపీసీ సివిల్ అధికారికి జిల్లా కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రతినిధులు చిలుక శంకర్, డి.బుచ్చన్న, పుట్టపాక స్వామి, రవి, సుధాకర్, నర్సయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జీఎంలు ఎన్.సుధాకర్ రావు, కె.నాగేశ్వరరావు

రామగిరి: ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీ ప్రతినిధులతో బుధవారం జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏరియాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, సభ్యులతో జీఎంలు చర్చించారు. నివాస గృహాల పరిసరాల్లో చెత్త శుభ్రపర్చడం, తడి, పొడి చెత్త తీసుకురావడానికి వాహనాలు ఏర్పాటు చేయడం, ఓసీపీ–1లో షావల్స్ లోడ్ తీసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడంపై చర్చించారు. నూతన లాకర్ల ఏర్పాటు, తాగునీటి కోసం నూతన వాటర్‌కూలర్ ఏర్పాటు, ఉద్యోగుల మూత్రశాలలకు నిరంతరం తాగునీటి సరఫరా పలు అంశాలపై చర్చించారు. జీఎంలు మాట్లాడుతూ కార్పొరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో స్ట్రక్చర్ కమిటీ సభ్యులు, ఎస్వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, ప్రాజెక్టు అధికారులు జె.రాజశేఖర్, సీ.హెచ్.వెంకటరమణ, విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం, బి.రాజేంద్రకుమార్, కాశీ విశ్వేశ్వరరావు, అధికారులు మతీన్ హుస్సేన్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. సీఎంపీఎఫ్ కమిషనర్ శ్రీహరి పచౌరీని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ నాయకులు మిట్టపల్లి మొగిలి, కలవేని స్వామి, నస్పూర్ బాపు, నీరటి సురేశ్, బి.సత్యనారాయణ, ఎ.నరేశ్, మర్రి రాజగోపాల్, బొల్లెన సమ్మయ్య, రవి పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ నాయకుల ధర్నా..

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు వెంటనే అందజేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న, నాయకులు నరేశ్, బి.అశోక్, బుచ్చమ్మ, వి.రాజనర్సు, శారద, నిర్మల, మేరీ, బండ పద్మ, కాంతయ్య, పోచయ్య, గట్టయ్య, సమ్మక్క, మల్లయ్య, సమ్మయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రితో యాదవ సంఘం సభ్యులు

రామగిరి: మండలంలోని కల్వచర్లలో గతంలో నిర్మించిన యాదవ సంఘం భవనం శిథిలావస్థకు చేరిందని, మినీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును యాదవ సంఘం సభ్యులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సెంటినరికాలనీలోని మేకల మార్కెట్‌లో జీవనోపాధి పొందుతున్న తమకు రేకుల షెడ్డు నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని శ్రీరామాంజనేయ మేకల మార్కెట్ సభ్యులు విన్నవించగా జీఎంతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మంత్రిని సన్మానించారు. యాదవ సంఘం సభ్యులు కొయ్యడ కిష్టయ్య, ఒర్రె సదయ్య, బనుక అంజయ్య, మేకల ఓదెలు, శీలం లక్ష్మయ్య, శీలం కొమురయ్య, బుట్టి రాజయ్య, కురుమల్ల రాజ్‌కుమార్, చిగురు సూర్యం, మేకల మారుతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వీడ్కోలు హంగామా



సుల్తానాబాద్‌రూరల్: టీచర్లతో విద్యార్థులు



కమాన్‌పూర్: నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఎంపీడీవో దివ్యదర్శన్, ఎంఈవో రాజయ్య, హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం.సుజాత, వీవోఏ.ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాంబిక పోచమ్మ నవరాత్రోత్సవాలు

రామగుండం: అంతర్గాం టీటీఎస్‌లో బర్మా, శ్రీలంక, కాందిశీకుల ఆరాధ్యదైవమైన శ్రీశ్రీశ్రీనూకాంబిక పోచమ్మ నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అవుతాయని జాతర కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు తెలిపారు. తొలిరోజు ఉదయం అమ్మవారి ఆలయం నుంచి పుట్ట బంగారం తీసుకురావడం, అమ్మవారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన, లక్ష్మీగణపతి హోమం, కుంకుమ పూజ ఉంటాయన్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పొలిమేర బంధన జరుగుతుందన్నారు. అదే విధంగా అమ్మవారి ఘటములు ధరించి ప్రతీరోజు గ్రామ సందర్శన చేపడతామని పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గోదావరిఖని: మాజీ కార్పొరేటర్ జనగామ కవిత సరోజినీకి చెందిన ఇళ్లు కూల్చివేత విషయంలో గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం ఏడుగురిపై కేసు నమోదు చేశారు. తనకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ శివాజీనగర్‌లోని తన షెడ్డును అన్యాయంగా కూల్చివేశారన్నారు. ఇదేమని అడిగిన తనను కులంపేరుతో దూషించి అవమానపర్చారని సరోజినీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది శ్రీధర్ ప్రసాద్, నవీన్, దీపిక, సాయి, అక్బర్‌అలీ, ఓగయ్య, జేసీబీ డ్రైవర్లపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

• గంజాయి విక్రేత అరెస్టు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ రాజీవ్ రహదారిపై సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో కరీంనగర్‌కు చెందిన మాల మల్లేశం(33) ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి 12కేజీల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి తన కారులో తీసుకుని సీలేరు నుంచి కొత్తగూడెం, ములుగు, ఏటూరు నాగారం మీదుగా ఎన్టీపీసీ ప్రాంతానికి వచ్చాడు. ఈ ప్రాంతంలోని కొంతమంది లేబర్లకు విక్రయించి మిగతా గంజాయిని కరీంనగర్‌లోని తన నివాసంలో ఉంచడానికి తీసుకెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతడి వద్ద లభించిన 12కేజీల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• గనిలో కార్మికుడికి గాయాలు

రామగిరి: మండలంలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు గనిలో ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం సెకండ్ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్ బండి సురేశ్ గాయపడి చేయి విరిగింది. 91 లెవల్‌లో పైపులైన్ కడుతుండగా నాలుగు ఇంచుల పైపు భుజంపై పడి చేయి విరిగింది. వెంటనే సెంటినరికాలనీ డిస్పెన్సరీకి తరలించగా ప్రథమ చికిత్స అందించి గోదావరిఖని ఏరియా అనుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ అనుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

• భూమి రిజిస్ట్రేషన్ చేస్తలేదని మహిళ నిరసన

భూమి అమ్మిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తుండడంతో కొనుగోలు చేసిన మహిళ అమ్మిన వ్యక్తి ఇంటి ఎదుట బుధవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. మహిళ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెందిన పూరెల్ల మణిమాల 2020లో అదే గ్రామానికి చెందిన పెద్దపల్లి శ్రావణ్‌కు చెందిన వ్యవసాయ భూమి సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లిలో సర్వేనెంబర్ 568/5లో దాదాపు 28 గుంటల భూమి గుంటకు రూ.1.65లక్షల చొప్పున 2022 వరకు దాదాపు రూ.42లక్షలు పలు దఫాలుగా అందజేసింది. అప్పటి నుంచి భూమి రిజిస్ట్రేషన్ చేయక దాటవేయడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగినా ఫలితం లేకుండా పోయింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం భూయజమాని ఇంటి ఎదుట బైఠాయించింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి మహిళను ఆందోళన విరమించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కానీ ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

• పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జూలపల్లి: ప్రత్యేక పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాచాపూర్, వడ్కాపూర్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు.

• కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని సిమ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రామగుండం నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్మిక కమిషనర్ ఎస్.వెంకటరెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు.

• హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఓదెల: మండలంలోని కొలనూర్ హైస్కూల్‌లో ఎంఈవో ఎర్ర రమేశ్ బుధవారం కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు.

• అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు నుంచి ఇసుక, ఆ సమీపంలో ప్రభుత్వ భూముల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రాజబాబు హెచ్చరించారు. గ్రామపంచాయతీలో బుధవారం గ్రామంలోని ట్రాక్టర్ల యజమానులకు ఇసుక, మట్టి రవాణాపై అవగాహన కల్పించారు.

వసతిగృహ సంక్షేమ అధికారిగా ఎంపిక



ప్రత్యూష

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన ప్రత్యూష వసతి గృహ సంక్షేమ అధికారి (వార్డెన్)ఉద్యోగానికి ఎంపికైంది. వసతిగృహ సంక్షేమ అధికారి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 738వ ర్యాంకు, కాళేశ్వరం జోన్–1లో 74వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికైంది. గట్టయ్య–విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. 2004లో గట్టయ్య మృతి చెందగా విజయలక్ష్మి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇద్దరు పిల్లలకు వివాహాలు చేయగా చిన్న కూతురు ప్రత్యూష ఎంఏ చేసి 2022 పీజీలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ప్రత్యూష ఉద్యోగం సాధించడంపై మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి చెస్‌పోటీ విజేతకు అభినందనలు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ఈనెల 16, 17, 18వ తేదీల్లో కోదాడలో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పెద్దపల్లికి చెందిన గడ్డాల శ్రీనివాస్ ప్రథమస్థానంలో నిలిచారు. జిల్లా పెన్షనర్స్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను జిల్లా అధ్యక్షుడు జీవన్‌రాజు, ప్రధాన కార్యదర్శి రాజంరాజు, చంద్రమౌళి, సుధాకర్‌రెడ్డి, హన్మయ్య, విక్టోరియా అభినందించారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

రామగిరి: సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆర్జీ–3 ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి అన్నారు. మండలంలోని లద్నాపూర్ సేవా భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను బుధవారం ఆమె పరిశీలించారు.

ఆటోడ్రైవర్స్ యూనియన్ ఎన్నిక

జ్యోతినగర్: ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ ఆటోడ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా బాబర్ సలీంపాషా, ప్రధాన కార్యదర్శి రంగినేని శ్రీరంగం, ఉపాధ్యక్షుడు మహ్మద్ అజ్జు, సంయుక్త కార్యదర్శి కాసరబోయిన నర్సింహరావును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్ వ్యవహరించారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

సుల్తానాబాద్: పట్టణంలో పోచమ్మ బోనాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, ఊరేగింపు మధ్య శివసత్తుల పూనకాలతో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, ఏఎంసీ డైరెక్టర్ కందునూరి పోచయ్య, ముత్యాలు, సంజీవ్, కొమురయ్య, లింగమూర్తి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

కార్మిక కుటుంబాల ఆహ్లాదానికే స్విమ్మింగ్ పూల్



స్విమ్మింగ్ పూల్ ప్రారంభిస్తున్న ఎస్వోటూ జీఎం రాముడు

గోదావరిఖని: వేసవిలో కార్మికులు, కార్మిక పిల్లల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్వోటూ జీఎం రాముడు కోరారు. యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను బుధవారం ఆయన పునఃప్రారంభించారు. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, నిమ్ ఇన్‌చార్జి హుస్సైనీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి



గోదావరిఖనిటౌన్: హాల్‌టికెట్లు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖనిటౌన్: సింగరేణి హైస్కూల్ సెక్టార్–2 పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ బుధవారం హాల్‌టికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కరస్పాండెంట్, అధికార ప్రతినిధి దేవరకొండ కిరణ్‌బాబు, హెచ్‌ఎం బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని ఆర్జీ–2 జీఎం వెంకటయ్య అన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జీఎం హాజరై విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. సింగరేణి యాజమాన్యం ఇస్తున్న పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఎస్వోటూ జీఎం రాముడు, పాఠశాల కరస్పాండెంట్ డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఏజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డిజీఎం మురళీకృష్ణ, ధనుంజయ్, ప్రదీప్, పాఠశాల హెచ్‌ఎం సుందర్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బుధవారం జీఎం ఎన్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 174 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 46మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఎస్వోటూ జీఎం గుంజపడుగు రఘుపతి తెలిపారు. 25మంది ఉద్యోగులు హాజరై 22 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు డి.తిరుపతిరావు, బి.శ్రీనివాస్, డీపీఎం గుర్రం శ్రీహరి, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలతో బొగ్గుగనుల ప్రైవేటీకరణ



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: కాంగ్రెస్ విధానాలతోనే దేశంలో బొగ్గు బ్లాకులు ప్రైవేట్ పాలయ్యాయని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ నిర్మాణమైందని విమర్శించారు. కార్మికులు ఐఎన్‌టీయూసీ నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య, నాయకులు వడ్డేపల్లి శంకర్, పింగిలి సంపత్‌రెడ్డి, చెల్పూరి సతీశ్, పోలాడు శ్రీనివాసరావు, రాజేశం, అన్వేష్‌రెడ్డి, రమేశ్, జనగామ మల్లేశ్, బొగ్గుల సాయి, తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనలో ముందుంటాం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో ముందుంటామని టీబీజీకేఎస్ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని వకీల్‌పల్లి గనిలో ఏజెంట్ నెహ్రూ, మేనేజర్ రవికిరణ్‌ను బుధవారం కలిసి నూతన కమిటీ నియామక లేఖను అందజేశారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందుకు సాగుతూనే కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టికి తీసుకువస్తామన్నారు. రవితేజ, మల్లేశ్‌నాయక్, శ్రీనివాస్, వెంకటస్వామి, భిక్షపతి, వెంకటేశ్, శ్రావణ్, మనోజ్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి: అఖిల భారత యాదవ మహాసభ, యాదవ ఛారిటబుల్ ట్రస్ట్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న యాదవులను గౌరవించుకునే కార్యక్రమాన్ని ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు పాలకుర్తి మండల యాదవసంఘం నాయకులు తెలిపారు. బసంత్‌నగర్‌లోని యాదవసంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సాహిత్యరంగం, సాంస్కృతిక, మహిళా సాధికారత, రాజకీయం, విద్యారంగం, ప్రతిభా పురస్కార్, స్వచ్ఛంద సేవా తదితర విభాగాల్లో విశిష్ట సేవలందిస్తున్న యాదవుల నుంచి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 23వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 25న సన్మాన గ్రహీతలను ఎంపిక చేసి ఉగాది రోజున రాఘవాపూర్ గ్రామ శివారులోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మంద భాస్కర్, బత్తిని లక్ష్మణ్, మేకల నర్సయ్య, మెండె అంజయ్య, అట్ల శ్రీనివాస్, పుట్ట రాజేందర్, తువ్వ రాజయ్య, తువ్వ సతీశ్, కాల్వ మహేశ్, రామ్మూర్తి పాల్గొన్నారు.



గోదావరిఖని: అంబేడ్కర్ విగ్రహానికి నివాళి



కాల్వశ్రీరాంపూర్‌లో..

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సుల్తానాబాద్: ర్యాలీలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని/పాలకుర్తి/యైటింక్లయిన్‌కాలనీ/రామగుండం/సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/జూలపల్లి/గోదావరిఖనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు జిల్లావ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.